
పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణకుమార్

## పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

నెల్లికుదురు, డిసెంబర్ 15 : నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌ను శనివారం రాత్రి తొర్రూరు డీఎస్పీ కృష్ణకుమార్ సీఐ జగదీశ్‌తో కలిసి తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ రికార్డులు, కేసుల నమోదు రికార్డు, పోలీసు కిట్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో తొర్రూరు ఎస్సై రమేశ్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

## కొనసాగుతున్న నెట్‌బాల్ పోటీలు

నెల్లికుదురు, డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నెట్‌బాల్, తాగ్‌తా, కురుష మార్షల్‌ఆర్ట్స్ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు కొనసాగుతున్నాయి. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర పరిశీలకుడు పీవీ రమణ ఆదివారం పోటీలను పరిశీలించారు. బాల, బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలు సెమిస్‌కు చేరుకున్నాయని తెలిపారు. నేడు అన్ని పోటీలు ముగుస్తాయని, నైపుణ్యం ప్రదర్శించిన వారు ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 22 నుంచి 27 వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సీహెచ్ ఐలయ్య, కొప్పుల శంకర్, కొమురయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బోల్తా పడిన లారీ


## అదుపుతప్పి లారీ బోల్తా

మరిపెడ : అదుపుతప్పి లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. లోడుతో వరంగల్ నుంచి విజయవాడకు వెళ్తున్న లారీ మరిపెడ మండల కేంద్రంలోని బక్కరూపుల తండా దగ్గర లారీ చాయిస్‌లు విరిగి, అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయలయ్యాయి.

## చలో అసెంబ్లీ విజయవంతం చేయాలి

గార్ల : నేడు నిర్వహించనున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు గణేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దవంగర : ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని గంట్లకుంట సూపర్ కింగ్స్ వాట్సాప్ గ్రూపు సభ్యులు గులాం హైమాద్, కన్నె సతీశ్, గోపు జంపన్న అన్నారు. ఆదివారం మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన చింతల రమేశ్ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి గంట్లకుంట సూపర్ కింగ్స్ వాట్సాప్ గ్రూపు సహకారంతో ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో యువకులు యువత చింతల యాకయ్య, ఎనుగంటి సతీశ్, చింతల ఐలయ్య, చింతల మహేందర్, కొండ సతీశ్ పాల్గొన్నారు.


మహబూబాబాద్‌లోని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు


అభ్యర్థులను చెక్ చేస్తున్న పోలీసులు


పరీక్ష కేంద్రంలోని వెళ్తున్న విద్యార్థులు

# గ్రూప్-2 పరీక్ష ప్రశాంతం

**తొలి రోజు 51.78 శాతం హాజరు**

మహబూబాబాద్ రూరల్/తొర్రూరు, డిసెంబర్ 15 : గ్రూప్-2 పరీక్ష జిల్లాలోని 21 కేంద్రాల్లో ఆదివారం తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. అన్ని సెంటర్ల వద్ద ఎస్సై స్థాయి అధికారులతోపాటు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు సెంటర్ల వద్ద తాగునీరు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. హాల్ టికెట్లను పరిశీలించిన తర్వాతే అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. జిల్లాలో మొత్తం 7,470 మంది అభ్యర్థులకు ఉదయం పేపర్-1 పరీక్షకు 3,886 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్-2 పరీక్షను 3,868 మంది అభ్యర్థులు రాశారు. 51.78 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారి, పరీక్షల ఆర్సీవో బలరాంనాయక్, డీవీహెచ్‌వో మరియన్న తనిఖీ చేశారు. ఎస్పీ సుధీర్‌నాథ్‌కేకన్ ఆదేశాల మేరకు పలు కేంద్రాల వద్ద, పేపర్లు తీసుకెళ్లే రోడ్లపై బాంబ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. తొర్రూరులోని పరీక్ష కేంద్రాలను ఆర్డీవో గణేశ్, తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ పర్యవేక్షించారు. తొర్రూరులోని 8 కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

**తల్లులు పరీక్షకు.. పిల్లల ఆలానలో పోలీసులు**

మహబూబాబాద్ పట్టణంలోని నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలకు అనేక మంది మహిళలు తమ చిన్నపిల్లలతో వచ్చారు. వారిని వారి కుటుంబ సభ్యుల వద్దే వదిలి సెంటర్‌లోకి వెళ్లారు. దీంతో చంటి పిల్లల ఏడుపులు కేంద్రాల వద్ద వినిపించాయి. ప్రధానంగా పట్టణంలోని తక్షశిలా సెంటర్ వద్ద ఓ మహిళ తన చంటిపిల్లను బంధువుల వద్ద వదిలి పరీక్షకు వెళ్లింది. కొంతసమయం తర్వాత చిన్నారి గుక్కపట్టి ఏడ్వడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న టౌన్ సీఐ దేవేందర్ చంటిపాపను తీసుకొని పాలు తాగిస్తూ ఆడించారు. మరికొంతసమయం మహిళా కానిస్టేబుల్ చిన్నపాపను ఆడించి ఏడుపును ఆపివేయించింది.

# ఒత్తిడిలేని పరీక్ష విధానం అవసరం

**ఎంఈవో బుచ్చయ్య**

తొర్రూరు, డిసెంబర్ 15 : ఒత్తిడిలేని పదో తరగతి పరీక్ష విధానం అవసరమని ఎంఈవో మహంకాళి బుచ్చయ్య అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో గ్రేడ్‌ల విధానం మంచిదా?... మార్కుల విధానం మంచిదా? అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహించారు. ఫోరం జిల్లా ఇన్‌చార్జి దొనికెన కుమార స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు, విద్యావేత్త సుందర్ రాజు, పెద్ద వంగర ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం తండా ప్రభాకర్, వేణు మాధవరెడ్డి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా విద్యను అందించాలని, అందుకు అనుకూలమైన కరికులం తయారు చేయాలన్నారు. ఒత్తిడి లేని విద్యావిధానం ఉండాలని సూచించారు. గ్రేడింగ్ విధానం రద్దు చేయడం మంచిదికాదన్నారు. అంతర్గత మా ర్కుల తొలగింపుతో వారిపై పనిభారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ముత్తినేని జయప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, జ్యోతి బాపూలే బీసీ గురుకులం ప్రిన్సిపాల్ శంకర్, ప్రతినిధులు రమేశ్, ఎంఎస్ భాను, స్థానికులు పాల్గొన్నారు.



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న ఎంఈవో బుచ్చయ్య

# ధర్నాను జయప్రదం చేయాలి

నెల్లికుదురు, డిసెంబర్ 15 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముం దు గొల్ల కురుమలకు 2వ విడుత గొర్రెలు పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలనే డిమాండ్‌తో ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం (జీఎంపీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామశాఖ అధ్యక్షుడు మంచాల వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా గొల్లకురుమలకు రెండో విడుత గొర్రెలు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తమ ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు హామీల అమలును మరిచిపోయారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రెండో విడుత లబ్ధిదారులను ఎంపిక చేసి వారి వ్యక్తిగత ఖాతాల్లోకి రూ. 2లక్షల నగదును బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా స హాయ కార్యదర్శి మంచాల హరీశ్, మండల అధ్యక్షుడు ఆకుల రాజు, కా వాటి యాకయ్య, దొంపత వెంకన్న, కొంపల్లి శ్రీశైలం, రాంమల్లు, సతీశ్, వేణు పాల్గొన్నారు.


ఇనుగుర్తి: కరపత్రాలను విడుదల చేస్తున్న బొల్లం అశోక్


నెల్లికుదురులో ధర్నా పత్రాలను ఆవిష్కరిస్తున్న జీఎంపీఎస్ నాయకులు

**రూ.2లక్షలు ఇవ్వాలి..**

ఇనుగుర్తి, డిసెంబర్ 15 : హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద గొల్లకురుమల ఆధ్వర్యంలో ఈ నెల 19న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నముపారంలో మండల జీఎంపీఎస్ అధ్యక్షుడు చిన్నాల కట్టమల్లు ఆధ్వర్యంలో ఆయన ధర్నా కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గొల్ల కురుమలకు గొర్రెలకు బదులుగా రూ.2 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా ఎక్స్‌గ్రేషియో, మందులు పంపిణీ అందజేయాలని, గొర్రెల కాపరులు మరణిస్తే రూ.10లక్షల కుటుంబానికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నర్రా అశోక్, రాజు, నరేశ్, వెంకన్న, ఏకాంబ్రం, కొమ్ముల కుమార్, మదర్, సుధాకర్ పాల్గొన్నారు.

## మైనార్టీలను పట్టించుకోవడం లేదు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 15 : ఏడాది కాలం పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ మ్యానిఫెస్టోను పట్టించుకోకపోవడం బాధాకరమని ముస్లిం సంఘాల తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమ కోసం రూ.3003కోట్లు కేటాయించిందని, ఇంత వరకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

## గ్యారెంటీలను అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం రూరల్ కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మాధవాపురంలో స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, వంట గ్యాస్‌తోపాటు కొంతమందికి పింఛన్లు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం, వెంకన్న, ఎల్లయ్య, శారద పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువతి మృతి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 15 : చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన ధరావత్ కవిత, వెంకన్న(లేట్) పట్టణంలో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కవిత పెద్ద కూతురు శ్రావ్య (19) ఓ ప్రైవేట్ కళాశాలలలో ఇంటర్ చదువుతున్నది. కళాశాలకు వెళ్లకుండా, ఇంటి దగ్గరే ఉండడంతో తల్లి మందలించింది. దీంతో శ్రావ్య మూడు రోజుల క్రితం గడ్డి మందు తాగింది. స్థానికులు గమనించి ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం యువతి మృతి చెందింది.

## ప్రజా సమస్యలపై పోరాటం

మహబూబాబాద్ రూరల్ : ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారధి అన్నా రు. ఆదివారం పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పెంచిన పన్నులు తగ్గించాలని, అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం పేదల పక్షాన ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నవీన్, శ్రావణ్, యాకమ్మ, ప్రవీణ్, శ్రీను పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 15 : ప్రతి శుభకార్యంలో మొక్కలను నాటడం అలవాటు చేసుకోవాలని హరితమిత్ర అవార్డు గ్రహీత, ప్రజా హృదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దైద వెంకన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని మిల్ట్రీ కాలనీలో ఆడెపు వీరస్వామి, అశ్వని దంపతుల గృహ ప్రవేశాన్ని పురస్కరించుకొని మొక్కలను అందజేశారు. భావితరాల కోసం మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


వీరస్వామి, అశ్వని దంపతులకు పూలమొక్కను అందజేస్తున్న వెంకన్న

## గ్యాస్ సబ్సిడీ రావడం లేదు

డోర్నకల్, డిసెంబర్15 : పేద ప్రజలకు గ్యాస్ సబ్సిడీ అందడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు శెట్టి వెంకన్న అన్నారు. ఆదివారం పెరుమాండ్లసంకీస ఎస్సీకాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్క పథకం సామాన్య ప్రజలకు చేరడం లేదన్నారు. 200 యూనిట్లు ఉచిత కరెంట్ అర్హులందరికీ అందడం లేదన్నారు. కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల జాడే లేదన్నారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బ వెంకటరెడ్డి, గండు రవి, మారు కొండయ్య, కొర్ని శ్రీను, నర్సయ్య, జహీర్‌ఖాన్, పాల్గొన్నారు.

## ఇండ్ల సర్వేలో ఇంటి పన్నుల వసూళ్లు

గార్ల : ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులు వసూళ్లు చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కందునూరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పినిరెడ్డిగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్నులు కడితేనే ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని పంచాయతీ కార్యదర్శులు పేదలను భయపెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అలవాల సత్యవతి పాల్గొన్నారు.

## పారదర్శకత పాటించాలి

నెల్లికుదురు : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు ఇండ్లు ధ్వంసమైన వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకూబ్, మచ్చ వెంకన్న, భిక్షపతి, మంగ్య పాల్గొన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మరిపెడ : గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం గ్రామ శాఖ గ్రామపంచాయతీ అధికారులను కోరింది. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాసమస్యలపై సర్వే నిర్వహించారు. అబ్బాయిపాలెంలో మాలగూడెం, పాతబజారు, ఎస్సీ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించారు. కార్యక్రమంలో నాయకులు లచ్చయ్య, గ్రామకార్యదర్శి ఉప్పలయ్య పాల్గొన్నారు.

## గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

దంతాలపల్లి : ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అలవాల వీరన్న, గునిగంటి మోహన్ అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో దంతాలపల్లిలో ఆదివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీను, వెంకటనారమణ, నర్సయ్య, వీరభద్రం, లక్ష్మయ్య, యాకూబ్, సుధాకర్ పాల్గొన్నారు.

## రాజకీయ ఒత్తిడి లేకుండా ఎంపిక చేయాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 15 : అధికార పార్టీ నాయకుల ఒత్తిడి లేకుండా అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం పట్టణ టు టౌన్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో కాలనీ సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి పైరవీలకు తావులేకుండా అర్హత గల పేదలకు లబ్ధి జరిగేలా ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్, లాలయ్య, నరసింహారావు, రమేశ్, సాంబ పాల్గొన్నారు.


మహబూబాబాద్‌రూరల్: ఇంటింటి సర్వే చేస్తున్న నాయకులు

# సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 15 : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగలను రెగ్యులర్ చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్‌లో కొనసాగుతున్న నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, వారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరన్న, నాయకులు భాస్కర్, భరత్, సాత్విక్, రంజిత్, అఖిల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



గార్ల పాకాల ఏటి వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

## పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలి

గార్ల, డిసెంబర్ 15 : రాంపురం పాకాల ఏటిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పాకాల ఏటిపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాలుగా పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కలగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా బ్రిడ్జి ఊసెత్తడం లేదన్నారు. వానకాలంలో ప్రజలు కష్టాలు పాలకులకు అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో జంపాల వెంకన్న, పోతుల రసింహారావు, రమేశ్, సుధాకర్‌రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 15 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కంబాలపల్లి, శనిగపురంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి మాట్లాడుతూ.. రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు పడేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం, ఇంకా రావాల్సిన ధాన్యం వివరాలను అడిగి తెలుకున్నారు. మార్కెట్లలో ఉన్న గన్నీ బ్యాకులు, కాంటాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలును నిర్వహించాలన్నారు.


శనిగపురం కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

## సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

డోర్నకల్ : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాస్ అన్నారు.ఆదివా రం డోర్నకల్‌లో సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది నిరుపేదలు ఇళ్లు లేక ఇబ్బందిపడుతున్నారని, యాప్ ద్వారా అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలన్నారు.

## జైన్ సమాజం మహిళా కమిటీ

డోర్నకల్, డిసెంబర్ 15 : డోర్నకల్ జైన్ సమా జం ఆధ్వర్యంలో ఆదివారం డోర్నకల్ జైన్ సమాజం మండల కమిటీని పట్టణంలోని జైన్ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా సుశీల్ పాట్ని, కార్యదర్శిగా భారతి కాలా, కోశాధికారిగా వినీత కాలా ఎన్నికయ్యారు. హైదరాబాద్ నుంచి 55 మంది జైన్ మహిళలు హాజరై మండల కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం, గార్ల నుంచి జైన్ మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం డోర్నకల్ జైన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జైన్ సమాజం రాష్ట్ర అధ్యక్షురాలు శిల్ప, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జైన్ సమాజం రాష్ట్ర అధ్యక్షురాలు శిల్ప

## హమాలీ కార్మికుడికి పరిహారం చెల్లించాలి

తొర్రూరు, డిసెంబర్15 : అమ్మాపురం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ని ర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఈ నెల 10న లారీ డ్రైవర్ నిర్లక్ష్యం తో క్షతగాత్రుడైన హమాలీ స్ఫూర్తిదాస్‌కు రూ.5లక్షల పరిహారం చెల్లించాలని తె లంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశా రు. ఆదివారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో నిద్రిస్తున్న హమాలీ స్ఫూర్తిదాస్ చేతివేళ్లపై నుంచి లారీని తీసుకెళ్లడంతో వేళ్లు నుజ్జునుజ్జు అయ్యాయన్నారు. బీహార్‌కు చెందిన హమాలీ కావడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు లారీ ఓనర్‌తో కుమ్మక్కై రూ.50వేలు చెల్లించి చేతులు దులుపుకున్నారని అన్నారు. వెంటనే హమాలీకి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని, లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా ఇరుముడి మహోత్సవం

డోర్నకల్, డిసెంబర్ 15: మున్సిపాలిటీ పరిధిలోని సో మ్లాతండా అయ్యప్ప స్వాములు ఆదివారం హనుమాన్ మందిరంలో ఇరుముడి మహోత్సవం నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ఇరుముడి మహోత్సవం అనంతరం మల్సూర్ స్వామి ఆధ్వర్యంలో 50 మంది స్వాములు శబరిమలై బయలుదేరి వెళ్లారు. డోర్నకల్ రైల్వేస్టేషన్ వద్ద స్వాములకు బంధువులు, స్నేహితులు, ఘనస్వాగతం పలికారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నర్సింహులపేట, డిసెంబర్ 15: రోడ్డు ప్ర మాదంలో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రాథోడ్ రాజేందర్(32) ఖమ్మం జిల్లాకేంద్రంలో ఉంటూ హైదరాబాద్‌లో సెక్యూరిటీగార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు.బైక్‌పై ఖమ్మం వెళ్తుండగా ఆదివారం తెల్లవారుజామున మండలంలోని పెద్దనాగారం స్టేజీ జీపీ పరిధిలోని జాతీయ రహదారిపై అదుపు తప్పి కిందపోయాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికి అక్కడే మృ తి చెందాడు. అతడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


రాజేందర్ ఫైల్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK SEPTIC TANK CLEANING

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565